
శ్రీ చంద్రఫామ్స్ & రిసార్ట్స్ ఇండియా లిమిటెడ్
నవ్య వీక్లీ సంయుక్త నిర్వహణ కథల పోటీలో
**ద్వితీయ బహుమతి రూ. 8,000**
**పొందిన కథ**

# ముందడుగు.. వెనకడుగు..

## పసుపులేటి తాతారావు



ఈ కథ చెపుతున్నది నేనే అయినా ఇందులోని ప్రధాన పాత్ర నేను కాదు. నా మిత్రుడు కమలాకర్రావు. వాడో విలక్షణమైన వ్యక్తి. అందరిలోకీ భిన్నమైన వాడు. అందరూ వాడిలాగే బ్రతుకుతూ, వాడిలాగే ఆలోచిస్తే ఈ ప్రపంచం ఇలా ఉండదు. మరోలా ఉంటుంది. దురదృష్టం ఏమిటంటే వాడిలా ఆలోచించే వాళ్ళు నూటికో కోటికో ఒక్కళ్ళు మాత్రమే ఉంటుంటారు. అందుకే ఈ ప్రపంచం ఎంత ముందుకు నడిచినా ఓ నాలుగడుగులు వెనక్కే పడుతుంటాయి. ఈ అడుగుల ప్రస్తావన మా మధ్య చాలా సార్లు వచ్చేది.

మనిషి ముందుకు వెళుతున్నాడా వెనక్కి వెళుతున్నాడా అన్న విషయం మీద చర్చ వచ్చినప్పుడు కమలాకర్రావు ఈ అడుగుల లెక్కలే చెప్పేవాడు.


ఒకసారెప్పుడో వాడికి వొంట్లో బాగోలేదంటే పరామర్శించడానికి వెళ్ళాను. ఆ మాటా ఈ మాటా చెప్పుకున్నాకా "ఇప్పుడు వైద్యశాస్త్రం బాగా అభివృద్ధి చెందిందిలేరా. ఇది వరకటిలా భయపడ నవసరం లేదు. ఎలాంటి లోపాన్నయినా ఇట్టే పసిగట్టేసే అద్భుతమైన పరికరాల్ని మనిషి కనిపెట్టాడు" అన్నాను ధైర్యం చెప్పడం కోసం.

"నిజమే. నేనూ వొప్పుకుంటాను. ఇదిగో ఈ రిపోర్ట్ చూసావా? ఎక్స్‌రే. ఇది ఇ.సి.జి., ఇది ఎండోస్కోపీ. ఇది అల్ట్రాసౌండ్ స్కాన్ రిపోర్ట్. ఇది ఎం.ఆర్.ఐ. స్కాన్ రిపోర్ట్. ఇది లివర్ ఫంక్షన్ టెస్ట్‌ది. మనిషి వీటిని కనిపెట్టి ఉండకపోతే డయాగ్నసిస్ ఇప్పుడున్నంత సమర్థవంతంగా ఉండేది కాదు. అది ఖచ్చితంగా ముందడుగే. కానీ. దీని వెనకఉన్న మరో కోణం నీకు తెలుసా? ఈ టెస్టులన్నిటికీ కలిపి నాకు ఏడు వేలు ఖర్చయింది. ఇంతకీ నేను డాక్టర్ దగ్గరికి వెళ్ళిన కారణం ఏమిటో తెలుసా? కొద్దిగా తలనొప్పి, కాస్తంత జ్వరం. అంతే. అంత చిన్న అనారోగ్యానికి ఈ టెస్టులన్నీ అవసరమంటావా? ఆ పరికరాలన్నీ లక్షలు ఖర్చు చేసి కొన్నవి కాబట్టి ఆ డబ్బు తిరిగి రాబట్టుకోవడం కోసం అవసరమున్నా లేకున్నా ప్రతీవారికీ మొత్తం పరీక్షలన్నీ వ్రాసి పారేస్తున్నారు. సందేహం వల్ల కలిగిన భయాందోళనతో రోగి ఆ పరీక్షలన్నీ చేయించుకోకుండా వుండలేడు.

వ్యాధిని నిర్ణయించడానికి పరికరాలు కనిపెట్టడం ముందడుగు అయితే, ఆ పరికరాలు కనిపెట్టినందుకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవలసి రావడం వెనకడుగు. కాదంటావా?" అని అడి

గాడు. నేను నోట మాట లేనట్టు ఉండిపోయాను.


ఈ ఒక్క విషయంలోనూ మాకు వాదనలు తప్పేవి కాదు. మనిషి ఒంటరి జీవనానికి స్వస్తి పలుకుతూ కుటుంబ వ్యవస్థని కనిపెట్టడం ముందడుగు అని నేనంటే, ఆస్తి తగాదాల్లో తలలు నరుక్కుని చావడం వెనకడుగు అని వాడనేవాడు.



నాగరికతని కనిపెట్టి మనిషి ఆకాశమంత ఎత్తుకి ఎదిగాడు అని నేనంటే రాజకీయపు రొచ్చుని కనిపెట్టి అథః పాతాళానికి కూడా దిగజారాడు అని వాడనేవాడు.

చివరికి నేను విసుగెత్తి ''మనిషి కంప్యూటర్‌ని కనుక్కోవడం అన్నది కలలోనైనా ఊహించామా? అది లేకపోతే ఈరోజు బ్రతుకే గడవదు. దానికేమంటావు?'' అని నేనంటే వాడు తడుముకోకుండా ఆ కంప్యూటర్‌ని నిర్వీర్యం చేసే వైరస్‌ని కనిపెట్టింది మాత్రం ఎవరు? మనిషి కాదా? అని అడిగేవాడు. అలా ఉండేది వాడి వాదన.

అయితే కమలాకర్రావు గురించి చెప్పేకన్నా ముందు నా గురించి కూడా ఎంతో కొంత చెప్పుకోవాలి.



నేనో రైల్వే గార్డుని. వ్యక్తిగతంగా అందరిలాగే సాదాసీదా వ్యక్తిని. నాకంటూ ఓ ప్రత్యేకత ఏమీ లేదు. ఓ ఆదర్శం అంతకన్నా లేదు. బహుశా అందుకే సుఖంగా బ్రతక గలుగుతున్నానేమో. కమలాకర్రావుకీ నాకూ ఒకేసారి ఉద్యోగం వచ్చింది. ఇద్దరం మధ్య తరగతి కుటుంబాల్లో జీవితాన్ని ప్రారంభించిన వాళ్ళమే. మా చిన్నప్పుడు ఇద్దరి ఆర్థిక స్థితీ ఒకలాంటిదే. నాకు రైల్వేలో ఉద్యోగం వస్తే వాడికి ఎలిమెంటరీ స్కూల్లో టీచర్‌గా వచ్చింది. ఇద్దరం ఉద్యోగాలు మొదలుపెట్టి ఇప్పటికి సరిగ్గా ఇరవై సంవత్సరాలు అయింది. నేను కాకినాడలో రెండంతస్థుల డాబా కట్టుకోగలిగాను. కమలాకర్రావు బ్రతుకంతా అద్దె ఇంట్లోనే గడిపాడు.

మా అబ్బాయిని సంవత్సరానికి లక్ష రూపాయిల ఫీజుతో ఇంజనీరింగ్ చదివించుకో గలుగుతున్నాను. వాడి కొడుకు బి.ఇడి. పాసయి ప్రస్తుతం ఉద్యోగాల వేటలో తిరుగుతున్నాడు. మా అమ్మాయికి పది లక్షలు కట్నం ఇచ్చి ఘనంగా పెళ్ళి చేసాను. అల్లుడు మల్టీనేషనల్ కంపెనీలో ఐదంకెల జీతగాడు. కమలాకర్రావు మాత్రం పెళ్ళికి ఎదిగి కూర్చున్న కూతుర్ని చూసి పెళ్ళి ఎలా చేయాలా అని ప్రతీరోజూ కుమిలి పోతుండేవాడు. ఈ మూడు ఉదాహరణలు చాలనుకుంటాను. వాడేమిటో, వాడి స్థితి ఏమిటో, మనస్తత్వమేమిటో తెలియ జెప్పడానికి.

లోకంలో జరిగే ప్రతీ అన్యాయాన్నీ చూసి వాడు తెగ చిరాకుపడేవాడు. ఈ జనం ఎందుకిలా ఉన్నారు? అందరూ నిజాయితీగా ఉంటే ఈ లోకం ఎంత బాగుంటుంది? అనేవాడు. అలా ఉండడం అసాధ్యంరా బాబూ అంటే వినిపించుకునే వాడు కాదు. ఎప్పుడో చచ్చాక సాధించే స్వర్గం కన్నా బ్రతికుండగా ఉన్న భూమినే స్వర్గంగా మార్చుకోగలిగితే ఎంత శోభాయమానంగా ఉంటుంది. సర్వమానవ సౌభ్రాతృత్వంలో ఎంత ఆనందం ఉంది? అనేవాడు.

రోజూ గార్డ్ పెట్టెలో కూర్చుని ప్రయాణికుల్ని గమ్యానికి చేర్చే నేను ఈ రోజు అదే రైల్లో ఒక మామూలు ప్రయాణికుడిలా రిజర్వేషన్ కంపార్ట్‌మెంట్‌లో కూర్చుని ప్రయాణించవలసి వస్తోంది. రైలు వేగంగానే నడుస్తోంది. మరింత వేగంతో వెళ్తే తప్ప వాణ్ణి చూడ్డానికి వీలు పడక పోవచ్చునేమో?

వాడే గనక ఈ ట్రైన్‌లో ఉండుంటే ఒక మాట ఖచ్చితంగా అని ఉండేవాడు. ''మనిషి రైలుబండిని కనిపెట్టి వేగాన్ని అధిగమించడంలో ఒక్కడుగు ముందుకు వేసినా అవినీతికి పాల్పడుతూ నాలుగడుగులు వెనక్కే వేస్తున్నాడు'' అని.

వాడలా అనడానికి ఓ కారణం ఉంది. ఆ మాట కొస్తే ఆ చురకేదో అన్యాపదేశంగా నాకే అని కూడా గ్రహించగలను. ఒకసారి వాడు ఏదో పని మీద అన్నవరం వెళుతున్నాడు. ట్రైన్ ఆగగానే జనరల్ బోగీలోకి ఎక్కడానికి విశ్వప్రయత్నం చేసి ఓడిపోయినట్టున్నాడు. తలుపు దగ్గర క్రిక్కిరిసి గబ్బిలాల్లా వేళ్ళాడే ప్రయాణికులని తప్పించుకుని బోగీలోకి ప్రవేశించడమంటే కొమ్ములు తిరిగిన యోధులకే సాధ్యం కాదు. ఒక కమలాకర్రావు వల్ల ఏమవుతుంది?

''రారా కమలాకర్, ఇలా వచ్చి ఇందులో కూర్చో'' అని పిలిచాను గార్డ్ కంపార్ట్‌మెంట్‌లోంచి. ఆ రోజు గార్డ్ డ్యూటీ నాదే.

''ఓరీ. నువ్వా?'' అంటూ ఆశ్చర్యపోయాడు.

''అయినా ఇందులో ప్రయాణించడం రూల్స్‌కి విరుద్ధం కదా?'' అన్నాడు.

''నీ మొహం. టిక్కెట్టు తీసుకునే కదా ఎక్కుతున్నావు? ఇందులో నువ్వు రైల్వేకి చేసే ద్రోహం ఏమీ లేదు కానీ, ఇంకేం ఆలోచించకుండా వచ్చి ఎక్కు'' అంటూ బలవంతంగా ఎక్కించాను.

విజిల్ వేసి పచ్చజెండా ఊపగానే ట్రైన్ కదిలింది. వాడు టూల్‌బాక్స్ మీద కూర్చుని సేద దీరుతున్నాడు. గార్డు కంపార్ట్‌మెంట్‌లో కూర్చుని ప్రయాణం చేయడం కొత్త. పైగా రూల్స్‌కి వ్యతిరేకం కాబట్టి అసహనంగా ఫీలవుతూ కూర్చున్నాడు. ఇంతకన్నా బహుశా జనరల్ బోగీలోనే సౌకర్యంగా ఉండే వాడేమో అనిపించింది -- క్రిక్కిరిసిన జనం మధ్యలో, ఊపిరి ఆడక పోయినా!

పెద్దస్టేషన్ రాగానే ట్రైన్ నిముషం పాటు ఆగుతూ మళ్ళీ బయల్దేరుతోంది. ట్రైన్ ఎక్కడ ఆగాలీ, ఎప్పుడు కదలాలీ అన్నది నా చేతిలో ఉన్న పచ్చ జెండా, ఫోకస్ లైట్ల మీద ఆధారపడి ఉంది. ''ఇంత పెద్ద ట్రైన్‌ని నీ గుప్పెట్లో పెట్టుకున్నావు సుమా'' అన్నాడు వాడు నవ్వుతూ. నేనూ నవ్వాను.

స్టేషన్‌రాగానే ఆగిన ట్రైన్ బయల్దేరిన ప్రతీసారీ బయటినుంచి విసురుగా ఏదో వచ్చి లోపల పడుతోంది. ఆ 'ఏదో' ఏమిటో నా ఒక్కడికే తెలుసు. వాడికి తెలీదు. వాటిని తీసి నా ట్రావెల్ బేగ్‌లో వేసుకుంటున్నాను. ఒక్క స్టేషన్‌లో మాత్రం అది గురి తప్పి వాడి వొళ్లో పడింది. వాడు కంగారుగా తీసి చూసాడు. ఐదు వందల రూపాయల నోట్లు దారంతో చుట్టలా చుట్టబడి ఉన్నాయి.

''ఒరేయ్. ఇదేమిట్రా? బయటినుంచి నోట్లు వచ్చి పడుతున్నాయి?'' అని అడిగాడు వాడు.

నేను ఇరకాటంలో పడిపోయాను. దొరికిపోయాకా ఇక తప్పించుకునే ప్రయత్నం చేయడం వృథా. అందుకే అన్నాను. ''అది ఉల్లిపాయల్ని ఎక్స్‌పోర్ట్ చేసే వాళ్ళు విసురుతుంటారు. సరుకుని పూర్తిగా ట్రైన్‌కెక్కించే వరకూ ట్రైన్‌ని షెడ్యూల్ టైమ్‌కన్నా అర నిమిషం పాటు అదనంగా నిలిపి ఉంచినందుకు నాకిచ్చే లంచం''.

అప్పుడు వాడి ముఖంలోని తిరస్కారభావం చూడలేక అవసరం లేకపోయినా డోర్ దగ్గరికి వెళ్ళి పచ్చ జెండా ఊపుతూ నిలబడ్డాను. అయినా వాడు వదల్లేదు. దగ్గరికి వచ్చి భుజం మీద చెయ్యివేసి తన వైపు తిప్పుకుని మరీ అడిగాడు. ''అది అన్యాయం కాదా? అలా లంచం తీసుకుని ట్రైన్‌ని నిలిపి ఉంచడం ప్రయాణికులకి అసౌకర్యం కలిగించడమే కదా?'' అన్నాడు.

''అర నిముషం. అంటే ముప్పయి సెకన్లు. ఏం కొంపలు మునిగిపోతాయి ప్రయాణికులకి? అసలా తేడాయే కనిపెట్టలేరు వాళ్ళు. అయినా నీలా మడి కట్టుకుని కూర్చుంటే ఈ రోజు మా అమ్మాయికి మంచి సంబంధం చూసి పెళ్ళి చేయగలిగే వాణ్ణా? మా వాడికి ఇంజనీరింగ్ సీటు సంపాదించగలిగే వాణ్ణా?'' అన్నాను కాస్త మందలింపుగానే.

''అవునులే. నిన్నని ఏం లాభం? లోకమే అలా ఉంది. ఎంత సంపాదిస్తున్నాడు. అని ఆలోచించి గౌరవిస్తుందే తప్ప ఎలా సంపాదిస్తున్నాడు అని చూసి ఏవగించుకోదు. అందుకే మనిషి స్వార్థం కోసం అంతలా నిర్లజ్జగా అవినీతికి దిగజార గలుగుతున్నాడు. అసహ్యించుకునే వాళ్ళే లేరు. పైగా ఆరాధించే వాళ్ళే అంతా. కాబట్టే వరదల్లో చిక్కుకుని ప్రాణభయంతో వొణికిపోతున్న వాళ్ళని వొడ్డుకు చేర్చే డ్యూటీలో ఉన్న వాడు సైతం మానవత్వాన్ని మరిచేసి లంచం ఇస్తే తప్ప వొడ్డుకి చేర్చనని బేరం పెడుతున్నాడు. మనిషి అనేక నూతన ఆవిష్కరణల్ని విజయవంతం చేస్తూ వైజ్ఞానికంగా ముందడుగు వేస్తోంటే నైతికంగా దిగజారుతూ నాలుగడుగులు వెనక్కి వేస్తున్నాడు. ఇంకేం బాగు పడుతుందీ లోకం?'' అన్నాడు స్వగతంలో అనుకున్నట్టు.

నేను వాడి మాటలకి బాధ పడలేదు. అలా బాధ పడేవాడు సుఖంగా బ్రతకలేడని నాకు తెలుసు. తిరిగి వాడికే హితబోధ చేయబోయాను. ''లోకంలో అందరూ ఎలా ఉన్నారో మనమూ అలా ఉంటేనే సుఖంగా బ్రతకగలం. ఊరంతా ఒక దారీ, ఉలిపికట్టెది ఒకదారీ అన్నట్టుంటే అవస్థలు తప్పవు. ఇప్పటైనా సీరియస్‌గా ఆలోచించు. మా నాన్న మాకోసం ఏం సంపాదించలేదని నీ పిల్లలే నిన్ను నిరసిస్తూండడం నువ్వు తట్టుకోగలవా? ఇప్పటికే ఆ సూచనలు నీ పిల్లల్లో పొడ చూపుతుండడం నాకు తెలీదనుకున్నావా? నిజం చెప్పు. అవునా? కాదా?'' అన్నాను.

వాడి మొహంలో కొద్దిగా నీలిఛాయలు అలుముకున్నాయి. నేనన్నది నిజమేనని వాడికీ తెలుసు. ''నేనేం తక్కువ చేసానురా వాళ్ళకి? తిండికీ గుడ్డకీ లోటు లేకుండా పెంచాను. చదువు చెప్పించి ప్రయోజకుల్ని చేసాను. నా శక్తి అంతా వాళ్ళకోసమే కదా ధార పోసాను. అంతకన్నా ఏం చేయగలను?' అన్నాడు.

''అదే చెప్పేది. ఈ రోజుల్లో నీ శక్తి ఒక్కటే ధార పోస్తే చాలదు. శక్తికిమించి మరేదో చేయాలి. చాలా మంది చేసేది అదే. ఇప్పుడు నువ్వు చూసిందీ అదే. నిలబడి నీళ్ళు తాగేకన్నా పరుగెత్తి పాలు త్రాగడమే నేటి నీతి'' అన్నాను.

''అలాంటివి నా వల్ల కాదు. ఏదో అదృష్టం బాగుండి నాలుగు జీతం రాళ్ళు సంపాదించుకోగలుగుతున్నాను. నా జీవనానికి, కుటుంబ పోషణకీ అది చాలదా? ఆశకి ఓ హద్దంటూ ఉండాలిగా? మితిమీరి సంపాదించడం, అదీ క్రమంగా, అంత అవసరమంటావా?'' అన్నాడు.

''నువ్వు బ్రతికున్నంత వరకూ నీ పిల్లల్ని ఏలోటూ లేకుండానే చూస్తావు. కీడెంచి మేలెంచమన్నారు. రేపు నీకేదయినా అయితే వాళ్ళ గతి? అది ఎప్పుడైనా ఆలోచించావా?'' అన్నాను.


వాడు నిర్లిప్తంగా నవ్వాడు. ''భగవద్గీత కనిపిస్తే కళ్ళకి అద్దుకుంటాం. పసుపు రాసి పూజలు చేస్తాం. కానీ అందులోని సారాన్ని మాత్రం గ్రహించం. ఈ లోకంలో ఎవరూ ఎవరి బాధ్యతా వహించలేరు. అన్నిటికీ ఆ పైవాడే శరణ్యం. ఆ సంగతి తెలీక మాయలో పడిపోతుంటాము. నేనూ అందుకు మినహాయింపేమీ కాదు. ఒకవేళ నాకేదైనా అయితే నా వెనక ఉన్నవాళ్ళు అన్యాయమై పోగూడదని నా పేర్న పది లక్షలకి ఇన్సూరెన్స్ తీసుకున్నాను. కాబట్టి వాళ్ళ గురించి నాకెలాంటి బెంగా లేదు'' అన్నాడు వాడు.

''టిక్కెట్ ప్లీజ్'' టి.టి.ఇ. మాట వినిపించి వాడి గురించిన ఆలోచనల్లోంచి బయట పడ్డాను. జేబులోంచి పాస్ తీసి చూపించాను.

టి.టి.ఇ. పాస్‌ని పరీక్షించి దాని మీద సంతకం పెట్టకుండా తిరిగి ఇచ్చేసాడు. సంతకం పెడితే మళ్ళీ మూడు నెలల వరకూ నేను ఉచితంగా రైల్లో ప్రయాణించే వీలుండదు. తోటి రైల్వేస్టాఫ్‌ని అన్న సాఫ్ట్ కార్నర్ చూపించాడు అతను. (కమలాకర్రావు దృష్టిలో మాత్రం దొంగా దొంగా తోడై ప్రభుత్వాన్ని దోచేయడం!).

ఇది వరకు కమలాకర్రావు తమ ఇంటికి రమ్మని చాలాసార్లు పిలిచాడు, ''చూడాలని ఉంది ఒక్కసారి రారా'' అంటూ వ్రాసేవాడు. నేనే నిర్లక్ష్యం చేస్తూ వచ్చాను. చివరికి ఇప్పుడు వాడే తనమాట నెగ్గించుకుని, బలవంతంగా రప్పించుకుంటున్నాడు.... చనిపోయి...

అవును. వాడు చనిపోయాడు. ఇప్పుడు నేను వెళ్ళేది వాడి శవాన్ని చూడ్డానికే. అందుకే ట్రైన్ మరి



కాస్త వేగంగా వెళితే బాగుణ్ణని అనుకుంటున్నాను. వాడి ఆఖరి చూపయినా దక్కుతుంది. వాడిక లేడు. ఏది ముందడుగు, ఏది వెనకడుగు అనే వాదనలు ఇక మా మధ్య ఉండవు. చివరి రోజుల్లో అప్పుడప్పుడూ నాకు ఫోన్ చేసి తన బాధని వెళ్ళగక్కుకునే వాడు.

"పిల్లలు నన్ను సరిగ్గా చూడ్డం లేదనిపిస్తోందిరా. వాళ్ళకి నేనంటే లెక్కలేకుండా పోతోంది. అనారోగ్యంతో బాధపడే తండ్రిని బిడ్డలే నిర్లక్ష్యం చేయడం అన్యాయం కదూ?" అనేవాడు. "రెక్కలాడినంత కాలం వాళ్ళకోసం మన రక్తాన్ని ధారపోసి పెంచుతాం. ఎందుకు? రెక్కలుడిగిపోయాకా వాళ్ళు మనకి ఆసరాగా ఉంటారనే నమ్మకంతోనే కదా? అదే కదా కుటుంబ వ్యవస్థలోని మూలాంశం. మనిషి వేసాడని నువ్వు చెప్పే ముందడుగు అదే కదా? మరి ఆ సూచనలే వాళ్ళల్లో కనిపించకపోతే ఆ నమ్మకద్రోహాన్నేమనాలి? ఇది వెనకడుగు కదా?" అని బాధ పడుతుండే వాడు.

వాడి సున్నిత మనస్తత్వం గురించి నాకు తెలుసు కాబట్టి ఓదార్చి వదిలేసే వాణ్ణి. వృద్ధాప్యంలో ఛాదస్తం పెరిగి పూచికపుల్ల గుచ్చుకున్నా గునపం దిగబడినట్టు బాధిస్తుంది. ఐడెంటిటీ క్రైసిస్ తలెత్తి చిన్నచిన్న తిరస్కారాలు కూడా అతిగా కలవరపరుస్తాయి.

"వాళ్ళ ప్రయారిటీస్ వాళ్ళకుంటాయిలేరా. ఆ క్రమంలో వాళ్ళు మనల్ని నిర్లక్ష్యం చేస్తున్నారనుకుంటాము. నిజంగా వాళ్ళ మనసులో ఆ ఉద్దేశ్యం ఉండక పోవచ్చు. చూద్దాంలే. వాళ్ళే నెమ్మదిగా మారతారు" అంటూ సర్ది చెప్పేవాణ్ణి.

ఉన్నట్టుండి వాడి ఇంటినుంచి ఫోన్ వచ్చింది చనిపోయాడన్న కబురు చెప్పడానికి. హార్ట్ ఎటాక్ట. అదో షాక్ నాకు. ఎంత లేదన్నా చిన్ననాటి స్నేహితుడు కాబట్టి మనసంతా బాధతో నిండిపోయింది. అందుకే ఈ అర్జంటు ప్రయాణం.

స్టేషన్‌లో దిగగానే ఆటో కట్టించుకుని సరాసరి వాడి ఇంటికి ప్రయాణ మయ్యాను. నేను వెళ్ళేసరికి శవాన్ని వాకిట్లో పడుకోబెట్టి దుప్పటి కప్పారు.

నిర్జీవంగా పడి ఉన్న ఆప్తమిత్రుణ్ణి చూడగానే కళ్ళు తడిబారాయి. గుండె బరువెక్కింది. అతని భార్య భర్త శవం పక్కన కూర్చుని ఏడుస్తోంది. కొడుకు, కూతురు కొద్దిగా దూరంగా కూర్చుని ముభావంగా ఉన్నారు. వాళ్ళ ముఖాల్లో దుఃఖఛాయలేవీ అంతగా కనిపించకపోవడం నాకు చిత్రంగా అనిపించింది.

కమలాకర్రావు ముఖంలోకి పరీక్షగా చూసాను. ఏదో తెలియని భ్రాంతి కలుగుతోంది నాకు. వాడి ముఖ కవళికలు చూస్తుంటే ఏదో చెప్పాలన్న కోరిక సగం లోనే ఆగిపోయినట్టు అనిపిస్తోంది. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. అది నా భ్రమా? నిజమా? ఒకవేళ నిజమైతే ఏం చెప్పాలనుకున్నాడు? ఎవరికి చెప్పాలనుకున్నాడు?

దహన సంస్కారాలు పూర్తయ్యాయి. లోకమంతా నిజాయితీగా ఉంటే ఎంత బాగుండేది అన్న వాడి పవిత్రమైన ఊహ కూడా వాడితో పాటే చితిలో కలిసి పోయిన భావం కలుగుతోంది.

శ్మశానం నుంచి తిరిగి వచ్చాక వాడి భార్యనీ, పిల్లల్నీ ఓదార్చి తిరుగు ప్రయాణ మయ్యాను. మనసంతా శూన్యం ఆవరించినట్టుంది. వాడెన్నో సార్లు రమ్మని పిలిచాడు. ఒక్కసారయినా వచ్చి చూసి ఉండాల్సింది అని ఇప్పుడనిపిస్తోంది. అదేమిటో కొన్నికొన్ని ఆలోచనలు కాలం మించి పోయాక వచ్చి బాధిస్తుంటాయి.

వారం రోజుల పాటూ వాడి గురించిన జ్ఞాపకాలే నన్ను వెంటాడుతూ వచ్చాయి. సైంటిస్టులు కొత్త ఉపగ్రహాన్ని కనుగొని దాని మీద స్పేస్‌షిప్‌ని నిలిపి ఫొటోలు తీసారన్న వార్త చదవగానే నా కళ్ళ ముందు కమలాకర్రావు రూపమే కదలాడేది. మరి అప్పుల బాధ తాళలేక విషం మింగి ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతన్నల మాటేమిటి? అని ప్రశ్నిస్తున్నట్టు అనిపించేది.

బ్లాక్‌హోల్ రహస్యాన్ని శోధించే దిశగా సైంటిస్టులు ముందడుగు వేసారని ఎక్కడైనా చదివితే ఆ వెంటనే కమలాకర్రావు స్వరం నా చెవుల దగ్గర ప్రతిధ్వనించేది. 'మనిషి మనసు పొరల్లో అట్టడుగున గూడు కట్టుకుని అపుడపుడూ నిద్రలేచే విద్వేషపు విషజ్వాలల్ని రూపుమాపే దిశగా అడుగులేమైనా ముందుకు పడుతున్నాయా? అని అడుగుతున్నట్టుండేది. మనిషికీ, మనిషికీ మధ్యనే కాదు, మనసుకీ మనసుకీ మధ్య కూడా దూరాలు పెరిగి పోతున్నాయి. అనుబంధాలు, బాంధవ్యాలు కాలగర్భంలో కలిసి పోతున్నాయి. ప్రేమలూ, ఆత్మీయతలు మటుమాయమై పోయి వాటి స్థానాల్లో అసూయ, పోటీ, విద్వేషం లాంటివి చోటు చేసుకుంటున్నాయి. ఒక మనిషి మరో మనిషి ఉనికిని సహించడం లేదు. ఇవన్నీ వెనక్కి వేసే అడుగులు.

ఒక గుర్రం ముందుకు పరిగెత్తే సమయంలో మరో గుర్రం వెనక్కి పరిగెత్త కూడదు. అలా పరిగెత్తితే రథం ఉన్న చోటునే ఉండి పోతుంది. అంగుళం కూడా ముందుకి కదలదు. అది ప్రగతి అనిపించు కోదు. ఇంత చిన్న విషయం ఎవరికీ అర్థం కాదేం? అని వాడి స్వరం ఘోషిస్తున్నట్టు వినిపించేది.

స్వరమే కాదు. ఆ రోజు పాడెమీద చూసిన వాడి ముఖం కూడా పదే పదే గుర్తొస్తోంది. ఏదో చెప్పబోతూ వీలుకాక ఆ సందిగ్ధంలోనే ప్రాణాలు వదిలేసినట్టున్న వాడి ముఖం. సమాధానం దొరకని చిక్కు ప్రశ్నలా నన్నింకా వేధిస్తూనే ఉంది. ఏం చెప్పాలనుకున్నాడు? మనసులో గూడు కట్టుకున్న ఏ తీరని వ్యథనో బయట పెట్టడానికి ప్రయత్నిస్తున్నట్టు ఉందా ముఖం. ఏం చెప్పాలనుకున్నా వినే నాధుడు లేడు వాడికి. మనసులో ఏం బాధ కలిగినా వాడు నాకే ఫోన్‌చేసి చెప్పేవాడు. ప్రాణం పోకముందు వెళ్ళి ఉంటే బహుశా నాకేమైనా చెప్పే వాడేమో? అయినా ఇప్పుడనుకుని ఏం లాభం?

పెద్దకర్మకి రమ్మని కార్డు వచ్చింది. వెళ్ళాను. అంతా రొటీన్‌గా జరిగిపోయింది. ఒక మనిషి ఈ లోకాన్ని విడిచిపెట్టి వెళ్ళడమనేది ఎంత విషాదకరమైన విషయమో ఆ బాధని అత్యంత సన్నిహితులు కూడా చాలా స్వల్ప కాలంలోనే మరిచిపోగలగడం అంతకన్నా గొప్ప విషాదం. అక్కడ ఎవ్వరి ముఖంలోనూ విషాదఛాయలు లేవు. కమలాకర్రావు అనే ఒక శాల్తీ అక్కడ ఉండేదన్న విషయాన్నే అందరూ మరిచిపోయినట్టు చాలా మామూలుగా ఉన్నారు.

కార్యక్రమం అంతా పూర్తయిపోయింది. తిరిగి వెళ్ళిపోయేటప్పుడు ఎవరికీ చెప్పకూడదు కాబట్టి నిశ్శబ్దంగా అక్కడ నుంచి నిష్క్రమించబోతుంటే "అంకుల్" అని వినిపించింది. వెనక్కి తిరిగి చూస్తే, కమలాకర్రావు కొడుకు.

"మా నాన్నగారికి బాగా క్లోజ్‌ఫ్రెండు మీరు. ఇక మీదట మీరే మాకు పెద్ద దిక్కు. వచ్చే నెలలో ఇక్కడ ఒక సూపర్‌బజార్ ప్రారంభించబోతున్నాను. ఇన్విటేషన్ పంపిస్తాను. తప్పకుండా రావాలి మీరు" అన్నాడు.

"చాలా సంతోషం నాన్నా. మీ భవిష్యత్తు

## ఒక చక్రం ముందుకు మరో చక్రం వెనక్కు



ప్రపంచం చాలా రంగాల్లో ముందుకు పోతోంది. ఊహాకందని ఉన్నత శిఖరాలని మనిషి అధిరోహిస్తున్నాడు. విజ్ఞానం అనూహ్యంగా పరిఢవిల్లుతోంది. కానీ అది ఒక పార్శ్వం మాత్రమే. మరో వైపు అమానుషత్వం, వంచన దారుణంగా పెచ్చు మీరుతున్నాయి. ముందుకు వెళ్ళే ప్రగతి రథాన్ని వెనక్కి లాగిపట్టి ఉంచే శక్తి స్వార్థ సంకుచితత్వాలకి ఉంది. అందుకే ప్రపంచం ఎంత ముందుకు పోతున్నా మనిషి బ్రతుకు ఈ భూమ్మీద ఇంకా దుర్భరంగానే ఉంది.

లేకపోతే మేధస్సుతో సూపర్ కంప్యూటర్‌ని కనుక్కున్న మానవజాతి తిండికి గతిలేక చనిపోవడమేమిటి? చంద్రమండలం మీద జెండా పాతిన మానవుడు చిన్న దోమకాటుతో చనిపోతూండడమేమిటి. అంటే మానవుని ప్రగతి రథపు చక్రాల్లో ఒక చక్రం ముందుకు కదులుతుంటే మరో చక్రం వెనక్కి నడుస్తోందన్న మాట. అందుకే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుంది ప్రస్తుత ప్రపంచం. ఈ భావాలు ఎప్పటినుంచో నా మనసులో కదులుతూ ఉన్నాయి. పోటీ కోసం కథ రాయాలని కూర్చున్నప్పుడు ఈ భావాల చుట్టూ కథ అల్లితే బాగుంటుందనిపించి ఈ కథ రాశాను. మంచి కథలకి నవ్య ఇస్తున్న ప్రోత్సాహం అభినందించదగ్గది.

–పసుపులేటి తాతారావు
25-19-1/10, మల్లెమొగ్గల వారి వీధి
కె.వి. హాస్పిటల్ రోడ్, ఎస్‌ఆర్ పేట
ఏలూరు –534002
9491974648

గురించే వాడు ఎప్పుడూ మధన పడుతూ ఉండే వాడు. మీరు ప్రయోజకులైతే వాడి ఆత్మ శాంతిస్తుంది. అన్నట్టు సూపర్‌బజార్ అంటే చాలా పెట్టుబడి కావాల్సి వస్తుందేమో?'' అన్నాను సందేహాస్పదంగా. వాళ్ళ స్థితి ఏమిటో నాకు బాగా తెలుసు.

''నాన్నగారి ఇన్సూరెన్స్ డబ్బు పది లక్షలు వచ్చిందంకుల్. మా చెల్లి వాటా ఐదు లక్షలతో ఏదో అపార్ట్‌మెంటు కొనుక్కుంటానంటోంది. నా వాటా ఐదు లక్షలు మార్జిన్‌మనీగా పెట్టి బేంక్‌లో లోను తీసుకుంటున్నాను'' అన్నాడు.

కమలాకర్రావు ఇదివరకెప్పుడో అన్నమాట గుర్తొచ్చింది. 'నేను పోయాకా వాళ్ళు అన్యాయమై పోకూడదని నా పేర్న పది లక్షలు ఇన్సూరెన్స్ చేసాన్లేరా. వాళ్ళ గురించిన దిగులు లేదు నాకు' అప్పుడు వాడన్న మాటే ఇప్పుడు నిజమైంది.

''అలాగే నాన్న తప్పకుండా వస్తాన్లే'' అని చెప్పి అక్కడినుంచి బయల్దేరాను.

ట్రైన్‌లో కూర్చున్నాకా మళ్ళీ ఆలోచనలో పడ్డాను. మనిషి పోయాడన్న దిగులు కొంచెమైనా వాళ్ళ ముఖాల్లో కనిపించక పోవడానికి కారణం ఇప్పుడు అర్థమైంది నాకు. వాడు పోతేనేం? పది లక్షలు వచ్చి పడ్డాయి. ఇంక దిగులెక్కడ ఉంటుంది. ఎంతగా మారిపోయిందీ ప్రపంచం? ఒకప్పుడు మనిషికున్న విలువని ఇప్పుడు డబ్బు ఆక్రమించేసింది. అది ఉన్నచోట మనిషి, మనసు, మమత ఇవేమీ ఉండవు.

ట్రైన్ నెమ్మదిగా కదిలి క్రమంగా జోరందుకుంది. కిటికీలోంచి గాలి వీస్తుండడం వల్ల అలవోకగా మాగన్ను పడింది. ఎదురుగా కూర్చున్న వ్యక్తి చేతిలో ఎఫ్.ఎం. రేడియోలో జాకీ నాన్ స్టాఫ్‌గా ఏదేదో చెప్పేస్తున్నాడు. మధ్యమధ్యలో పాటలు, ఆ మధ్యలో అడ్వర్టయిజ్‌మెంట్లు...

ఉన్నట్టుండి ఏదో ఇన్సూరెన్స్ కంపెనీ యాడ్ మొదలైంది. ''మా కంపెనీ పాలసీ తీసుకోండి. ఇక జీవితమంతా నిశ్చింతగా బ్రతకండి'' అంటూ తియ్యగా వినిపిస్తోందో స్వరం. సగం నిద్రలో అదంతా నాకు లీలగా వినిపిస్తూనే ఉంది.

నా పక్కన కూర్చున్నతను ఎవరితోనో అంటున్నాడు. ''ఇన్సూరెన్స్ స్కీమ్ నిజంగా అద్భుతం కదండీ. ఒక మనిషి చనిపోతే బ్రతికున్న లక్ష మంది అతని కుటుంబానికి కొమ్ము కాసే గొప్ప చిట్కా. నిజంగా ఇన్సూరెన్స్ పద్ధతిని కనిపెట్ట గలగడం మనిషి తెలివితేటలకి నిదర్శనం. మానవ జీవితంలో అది ఖచ్చితంగా ముందడుగే...!''

ఒక్క కుదుపుతో ఉలిక్కిపడ్డాను. ముందడుగు... బ్రతికుండగా ఎప్పుడూ కమలాకర్రావు అంటుండే పదం అది.

ఎవరో కొరడాతో చెళ్ళున కొట్టి మేల్కొలిపినట్టయింది. 'ముందడుగు...!' ఆ మాటతో నా నిద్ర మత్తంతా ఎగిరిపోయింది. ఒక్క ఉదుటున లేచి నిటారుగా కూర్చున్నాను. సప్త సముద్రాల ఘోష నా మస్తిష్కంలో గింగుర్లు తిరుగుతోంది. మైండు మొద్దుబారిపోయినట్టయింది.

సర్జరీ కనిపెట్టడం వైద్యరంగంలో ముందడుగు. కానీ డబ్బు సంపాదించడం కోసం అవసరం లేని సర్జరీలు చేయడం వెనకడుగు. అలాగే ఇన్సూరెన్స్ పద్ధతిని కనిపెట్టగలగడం మనిషి జీవితంలో ముందడుగు అయితే.... మరి దానికి సంబంధించిన వెనకడుగు....! వెనకడుగు.... వెనకడుగు...?!

ఒక భయంకరమైన భావకెరటం రివ్వున వచ్చి నా మనసుని బలంగా తాకి వెళ్ళిపోయింది. అంటే.... ఇన్సూరెన్స్ డబ్బు వస్తుందన్న ఆశతో... నా మిత్రుడు కమలాకర్రావు మృత్యుమార్గంలో కొట్టుమిట్టాడుతున్న సమయంలో... అందరూ నిశ్శబ్ద ప్రేక్షకుల్లా చూస్తుండి పోయారా?.... అతని ప్రాణాలు కాపాడ్డానికి తీసుకోవలసినంత శ్రద్ధ తీసుకోగలిగీ తీసుకోలేదా?.....

వీళ్ళు నన్ను సరిగ్గా చూడ్డం లేదురా అని వాడు ఫోనులో మొర పెట్టుకుంటుంటే వృద్ధాప్యపు ఛాదస్తంతో అంటున్నాడనుకున్నానే కానీ దాని వెనక ఇంతటి కిరాతకపు నిర్లక్ష్యం ఉండి ఉంటుందనుకోలేదు. ఎవరికీ చెప్పుకోలేక ఏమీ చేయలేక ఎంత మధనపడి ఉంటాడో పాపం?

గొంతు నులిమి చంపేస్తేనే హత్యకాదు. చావుకి చేరువవుతున్న వాణ్ణి రక్షించకుండా చూస్తూ ఊరుకోవడం కూడా హత్యే. కానీ ఎవరు నిర్ధారించగలరీ వ్యత్యాసాన్ని?

ఈ సంగతే చివరి క్షణంలో వాడు నాకు చెప్పాలనుకున్నాడా? శవంగా ఉన్నప్పుడు వాడి ముఖంలో నాకు కనిపించిన భావం.... ఏదో చెప్పబోతున్నట్లు... చెప్పలేక మధ్యలోనే ఆగిపోయినట్టు.... ఒకవేళ ఆ భావం ఇది కాదు కదా?

ఏమో. నిజమేమిటో, అబద్ధమేమిటో ఆ పైవాడికే తెలియాలి. నాకొచ్చిన అనుమానం నిజం కావచ్చు. అబద్ధం కావచ్చు. ఒకవేళ నిజమైతే మాత్రం...

మానవుని ప్రగతి రథం ఖచ్చితంగా తిరోగమనంలో నడుస్తున్నట్టే. ఎలాంటి సందేహం లేదు. అతని అడుగులు వెనక్కే పడుతున్నాయి.

*

కవిత

# మానవ ప్రవాహం



ఎక్కడో మనిషి పరిమళించాడు
రాత్రిని రాల్చుకుంటూ
మట్టి దేహపు గొంతుకలోంచి
స్వప్నాన్ని గానం చేస్తున్నాడు
అతడు యుద్ధగీతం పాడుతున్నాడు
సమూహం నుంచి విడిపడి
పాటని గొంతు విల్లులోంచి బాణంలా వదిలాడు
అతను పరిమళిస్తున్నంత సేపు పాడతాడు
అతని బలమూ, బలగమూ పాటే
నిద్రలోంచి మేల్కొల్పి
మనం అంతరించి పోతున్నామని
కంటి కొసలు చిట్లి
కన్నీళ్ళు ప్రవాహాలవుతున్నాయని
దేహపు గూటిలోని చీకటిని తరమండని
అతను హెచ్చరిస్తున్నాడు
యుద్ధ ప్రార్థనని ముగించిన పిదప
శాంతికోసం పాటని ప్రారంభించాడు
యుద్ధ ధర్మం తెలిసిన వాడు గనకే
అతని చేతిలో ఆయుధం లేదు
మానవ ధర్మం తెల్సిన వాడు గనకే
అతని దేహం మీద కవచం లేదు
నిదురమీద మెలకువని నాటి
చిరునవ్వుతో తొలి అడుగు వేసి
రహస్యవానం కోసం నిరీక్షణ మొదలు పెట్టాడు
పాటవల్ల అన్నీ ఆగిపోతాయి.. ఒక్క యుద్ధం తప్ప
ఎందుకో ఆ విషయం అతనికి తెల్సీ పాడుతున్నాడు
పాడటమేనట అతని దృష్టిలో తపస్సు
రండి మనమూ పరిమళిద్దాం
నలుమూలలా వెల్తురు దీపాలై సంచరిద్దాం
పక్కవాడు గాయంతో ఉంటే
సుఖంగా నిద్రించేవాడు మనిషెలా అవుతాడు
మనమూ గొంతు కలుపుదాం
తలమీద చెంగు కప్పుకుని రోదిస్తున్న ఆవిడనీ పిలవండి
కాళ్లు తెగిపడ్డ బాలుణ్ణి భుజానికెత్తుకోండి
ఒకరి కన్నీటి బొట్లని మరొకరు తుడవండి
రాత్రి మద్యం తక్కువయిందని
ఆవిడని హింసించిన అతడిని కూడా పిలవండి
హృదయ శకలాల్ని సమీకరించి అతికించండి
శాంతి రాదని విరక్తితో
ప్రపంచం నుంచి దూరంగా వెళ్ళిన జ్ఞానుల్నీ పిలవండి
రండి సమూహం కండి
చేజారిపోయిన మానవత్వాన్ని పునర్మిద్దాం
పరిమళించే సమయం ఆసన్నమయింది
విడదీయలేని బంధంతో
అందరం పెనవేసుకు కదులుదాం
ఒకరుముందూ మరొకరు వెనుకా అని లేదు
అందరిదీ ఒకే అడుగు.. ఒకే కదలిక.. ఒకే పాట
గొంతుకలలోని స్వరనాళాలకు పదును పెట్టండి
అదే మన ఆయుధం.. వెపన్
పాడే వాడు వెనక్కు తగ్గడు.. ఉప్పెనై ఊగిపోతాడు
శాంతికోసం పాడుతున్నప్పుడు
మనిషి కరిగి ప్రవహిస్తాడనే నమ్మకం నాకుంది
పాడుతూ ప్రవహిద్దాం
పరిమళిస్తూ రాలిపోదాం
నా ఊపిరి నీకు బలాన్నిస్తుందంటే
ముందుగా నేనే రాలిపోతాను.. పాట ఆపొద్దు
పాడుతూనే పరిమళించు..

– షేక్ ఖాదర్ షరీఫ్